
# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 127 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 27 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 127 27-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-

**ఆదాయం పెంపుపై దృష్టి**

ఆర్థికశాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

2 లో..

## మోడీ విజన్, చంద్రబాబు ప్లానింగ్‌తో

# ఏపీ అభివృద్ధి

- రూ.430 కోట్లతో ఏపీలో పర్యాటక ప్రాజెక్టులు..
- కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

**రాజమహేంద్రవరం జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మోడీ విజన్, చంద్రబాబు ప్లానిగ్‌తో ఏపి అభివృద్ధి చెందుతుందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో 'అఖండ గోదావరి' టూరిజం ప్రాజెక్టుకు కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ శంకుస్థాపన చేసి



ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షెకావత్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ విజన్, సీఎం చంద్రబాబు నాయుడు ప్లానింగ్‌తో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని అన్నారు. ఇరిగేషన్, టూరిజం అభివృద్ధికి కేంద్రం ఏపీకి పూర్తి సహకారం అందిస్తుంది. టూరిజం రంగానికి డబుల్ ఇంజన్ సర్కార్ రూ. 450 కోట్లు ఇచ్చింది. ఏపీకి చాలా ప్రాజెక్టులు వస్తున్నాయి. వాటిలో ఒకటి రాజమండ్రిలో

- తరువాయి 2లో..







## అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి

# చేరుకున్నశుభాంశు శుక్లా..

**న్యూఢిల్లీ జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌–ఎస్)కి చేరుకున్నారు. ఆక్సియం –4 మిషన్‌లో భాగంగా శుక్లా సహా నలుగురు వ్యోమగాములతో కూడిన క్రూ డ్రాగన్ క్యాప్సూల్ గురువారం సాయంత్రం ఐఎస్‌ఎస్‌తో డాకింగ్ ప్రక్రియ పూర్తయింది. ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సేంటర్ నుండి 424 కి.మీ ఎత్తులో ఉన్న కేంద్రానికి 28 గంటల ప్రయాణం విజయవంతమైంది. డాకింగ్ ప్రక్రియ అనేది క్రూ క్యాప్సూల్ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానించే విధానం. ఇది చాలా కీలకం. డాకింగ్ ప్రారంభించే ముందు క్రూ క్యాప్సూల్ మొదట అంతరిక్ష కేంద్రంతో కలవాల్సి వుంది. అవి రెండూ ఒకే కక్షలో ఉండాలి, అలాగే ఒకదానికొకటి దగ్గరగా

- తరువాయి 2లో..



**స్పేస్ పాలసీతో రు. 25 వేలకోట్ల పెట్టుబడులు**

లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీలు - సమీక్షలో సిఎం చంద్రబాబు

# గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం

### మాదక ద్రవ్యాలను విక్రయిస్తే ఆస్తుల జప్తు
### గుంటూరులో యాంటి నార్కోటిక్స్ డే ర్యాలీలో సిఎం చంద్రబాబు


**గుంటూరు జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గంజాయి, డ్రగ్స్ పూర్తిగా నిర్మూలించే వరకు యుద్ధం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. యాంటి నార్కోటిక్స్ డే సందర్భంగా గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గుంటూరులో చేపట్టిన 'డ్రగ్స్ వద్దు బ్రో' వాకథాన్‌లో ఆయన పాల్గన్నారు. అమరావతి రోడ్డులోని ఐడి ఆస్పత్రి నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. డ్రగ్స్ వినియోగాన్ని నిషేధించాలన్న ప్లకార్డులు చేతబూని చంద్రబాబుతోపాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందుకు నడిచారు. డ్రగ్స్, గంజాయిలపై ఫిర్యాదులకు వాట్సప్, టోల్ ఫ్రీ నెంబర్లను ఆవిష్కరించారు. సభలో మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో విద్యార్థులు, యువతతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. మాదక ద్రవ్యాలను విక్రయిస్తే ఆస్తుల జప్తు చేస్తామని, ఈ యుద్ధానికి ఎవరైనా

- తరువాయి 2లో..




# డిఎస్సీకి 91.17శాతం హాజరు



**అమరావతి జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్సి పరీక్ష 17వ రోజు 91.17శాతం మంది అభ్యర్ధులు హాజరయ్యారు. టిజిటి(లాంగ్వేజ్), ఇంగ్లీష్, టిజిటి(నాన్ లాంగ్వేజ్, ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 17,383 మంది అభ్యర్ధులను కేటాయించామని మెగా డిఎస్సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 78 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన టిజిటి ఇంగ్లీష్ పరీక్షకు 13,062 మంది కేటాయించగా 12099(92.63శాతం)మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 39 పరీక్ష కేంద్రాల్లో జరిగిన టిజిటి(నాన్ లాంగ్వేజ్) ఫిజికల్ సైన్స్ పరీక్షకు 6,005 అభ్యర్ధులకు గాను 5284(87.99శాతం) మంది హాజరయ్యారని వెల్లడించారు.

## అమరావతి రాజధానిలో హెచ్‌ఓడి, జిఏడి

# టవర్ల నిర్మాణాలకు ఎల్‌ఓఏ

**అమరావతి జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతిలో చేపడుతున్న ఐకానిక్, హెచ్‌ఓడి, సెక్రటేరియట్ భవన నిర్మాణ సముదాయాలకు సంబంధించి లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్‌ఓఏ)లను కాంట్రాక్టు సంస్థలకు సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు గురువారం అందజేశారు. అమరావతిలోని హెచ్‌ఓడి టవర్లు 1,2 జిప్లస్39 పద్ధతిలో నిర్మించనున్నారు. వీటిని షాపూర్‌జీ పల్లోంజి సంస్థ దక్కించుకుంది. టవర్ 3,4 పనులను ఎల్‌అండ్‌టికి

- తరువాయి 2లో..



### అమరావతిలో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు

**అమరావతి జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతిలో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. టెండర్లలో ఎల్ 1గా నిలిచిన సంస్థలకు బిడ్లు ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటిగ్రేటెడ్ ఎపీ సెక్రటేరియట్, హెచ్‌ఓడీ కార్యాలయాల నిర్మాణ టెండర్లను ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ రూ.882.47 కోట్లతో సచివాలయంలోని జీఏడీ టవర్‌ను నిర్మించనుంది. ఇంటిగ్రేటెడ్ సచివాలయంలోని 1, 2 హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణ పనులను

- తరువాయి 2లో..



## చేనేత సహకార సంఘాల

# బకాయిలు చెల్లించండి

### మంత్రి లోకేష్‌కు చేనేత కార్మిక సంఘం వినతి

**గుంటూరు, జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ కింద రూ.156 కోట్లు వెంటనే చెల్లించాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌ను ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు గుంటూరు జిల్లా ఉండవలిల్లో గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. త్రిఫ్ట్‌ఫండ్ రూ.5 కోట్లను సత్వరమే విడుదల చేయాలని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని, సహకార సంఘాలకు 2025 మార్చి నాటికి ఉన్న సిసి మొత్తం రద్దు చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు. చేనేత

- తరువాయి 2లో..

## కూటమి ప్రభుత్వానికి..

# ఆర్థిక క్రమశిక్షణ లేదు



- అధిక వడ్డీలకు అప్పులా?
- ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుంది బాబూ?
- గతంలోనే ఈ రాజ్యాంగ ఉల్లంఘనలపై హైకోర్టు నోటీసులు జారీ చేసింది
- అయినప్పటికీ ఏపీఎండీసీ ద్వారా మళ్లీ అప్పులు చేశారు
- ప్రభుత్వ ఖజానా నుంచి ప్రైవేట్ వ్యక్తులు నిధులు డ్రా చేసుకోవడానికి వీల్లేదు
- ఎక్స్ వేదికగా వైయస్ జగన్ ఆగ్రహం

**అమరావతి జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను గాలికొదిలేసి, రాజ్యాంగ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిధుల సమీకరణ పద్ధతులపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. 2025 జూన్ 25న ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) రెండో విడత నాన్–కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీలు లేదా బాండ్లు) జారీని పూర్తి చేసిందని, 9.30 శాతం అధిక వడ్డీ (కూపన్) రేటుకు రూ. 5,526 కోట్లు సమీకరించిందని జగన్ తెలిపారు. దీంతో మొత్తం బాండ్ల విలువ రూ. 9,000 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏపీ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, నోటీసులు కూడా జారీ అయ్యాయని గుర్తుచేశారు. ఈ బాండ్ల ద్వారా సమీకరించిన నిధులను ప్రభుత్వ రెవెన్యూ వ్యయాల కోసం వినియోగిస్తున్నారని స్పష్టమవుతోందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా విస్మరించి, అపూర్వమైన రీతిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంఘటిత నిధిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందని జగన్ దుయ్యబట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వారా డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు జారీ చేసి, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండానే ప్రైవేటు వ్యక్తులు రాష్ట్ర ఖజానా

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం
దినపత్రిక

## సంపాదకీయం

# యుద్ధభూముల్లో జీవితపోరాటం

బాంబుల దాడులు, సైనిక బలగాల కవాతు విన్యాసాలు, సైరన్ల హెచ్చరికలు, నగరాల విధ్వంసాలు.. ఇలాంటి అత్యంత భయానక వాతావరణంలోనూ తమ జీవనపోరాటం కోసం ఆరోగ్య సంరక్షకులుగా, నిర్మాణాల కూలీలుగా, తాపీ మేస్త్రీలుగా, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్లుగా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ఎందరో భారతీయులు గత కొన్నేళ్లుగా మనుగడ సాగిస్తున్నారు. అక్కడి యూనివర్శిటీల్లోనూ ఎందరో భారతీయ విద్యార్థులు చదువుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ఇరాన్ దేశాల మధ్య కొన్ని రోజులపాటు యుద్ధం బీభత్సంగా సాగింది. ప్రవాస భారతీయులను స్వదేశానికి రప్పించాలన్న బాధ్యతతో భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధు పేరుతో అక్కడి భారతీయులను తరలించడం ప్రారంభించింది. పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్ వాసులకు కూడా ఆపరేషన్ సింధు సహకరిస్తోంది. ఇప్పటివరకు ఇరాన్ నుంచి 2858 మందిని, ఇజ్రాయెల్ నుంచి 818 మందిని కేంద్ర ప్రభుత్వం రప్పించ గలగడం హర్షించదగిన చొరవే.

అయితే గత కొన్నేళ్లుగా ఆ దేశాల్లో వివిధ వృత్తులు, ఉద్యోగాలు చేస్తూ బతుకుతున్న వారు మాత్రం తిరిగి భారత్‌కు రావడానికి ఇష్టపడడం లేదు. దేశాల యుద్ధం కన్నా తమ జీవన పోరాటం ముఖ్యమన్న అభిప్రాయం వారిలో కనిపిస్తోంది. ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక అభివృద్ధి దేశంగా ఎదుగుతున్న భారత్‌లో ప్రస్తుతం ఉంటున్న భారతీయుల్లో కొందరు ఆ దేశాలే తమ జీవనోపాధికి గమ్యస్థానాలన్న ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. భారత ప్రభుత్వానికి ఇదో పెద్ద సవాలు. దేశంలో పౌరుల భద్రతకు ఢోకా లేదని, ఇతరత్రా సహకారం లభిస్తుందన్న కేంద్ర ప్రభుత్వ హామీలు ఉంటున్నా దాని ప్రభావం ఎంతవరకు పనిచేస్తుందో ప్రశ్నార్థకం. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ప్రస్తుతం ఉంటున్న భారతీయుల్లో కేవలం 10 నుంచి 12 శాతం మంది మాత్రమే స్వదేశం భారత్‌కు తిరిగి వస్తున్నారని ఇజ్రాయెల్ లోని ప్రవాస భారతీయ ప్రతినిధులు చెబుతున్నారు.

ఇజ్రాయెల్‌లో 15,000 మంది భారతీయులు ఆరోగ్య సంరక్షకులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో చాలామంది తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు చెందినవారే. ఇజ్రాయెల్‌లో తెలంగాణ ఆరోగ్య సంరక్షకులు నెలకు రూ. 1,50,000 వరకు సంపాదిస్తున్నారు. ఆహారం, వసతి తదితర సౌకర్యాలు వీరికి ఉచితంగా లభిస్తున్నాయి. ఇటువంటి సౌకర్యాలు స్వదేశం భారత్‌లో తమకు లభిస్తాయా? అన్న ప్రశ్న ఎదురవుతోంది. 'సంఘర్షణ అన్నది తమకు కొత్తేమీ కాదు. హమాస్, హెజ్బొల్లా, హౌతీస్ ఇలా ఎన్నో ఉగ్రవాద గ్రూపుల నుంచి నిత్యం తమకు సంఘర్షణలు ఎదురవుతూనే ఉన్నాయి. కానీ ఇజ్రాయెల్ ఐరన్‌డ్రోమ్ మమ్మల్ని నిత్యం రక్షిస్తోంది. స్కూళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, అపార్టుమెంట్లు ఇలా ప్రతిచోట భూగర్భ బంకర్లు ఉన్నాయి. అందువల్ల మా భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదు' అన్న నమ్మకం ప్రవాస భారతీయుల్లో కనిపిస్తోంది.

ఇక విద్యార్థుల చదువుల విషయానికొస్తే ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో చదువులకయ్యే ఖర్చు భారత్‌తో పోలిస్తే చాలా తక్కువ. ఒక్క ఇరాన్‌లోనే 4000 మంది భారతీయ విద్యార్థులు చదువుకొంటున్నారు. వీరిలో సగానికి సగం మంది కశ్మీర్ విద్యార్థులే. భారత్‌లో ఎంబిబిఎస్ సీటు ప్రైవేట్ కాలేజీల్లో సంపాదించాలంటే రూ. కోటి వరకు ఖర్చు పెట్టవలసివస్తుంది. అదే ఇరాన్‌లో మొత్తం ఎంబిబిఎస్ కోర్సుకు రూ. 30 లక్షలు మాత్రమే ఖర్చవుతుంది. దీనికి కారణం ఇరాన్‌లో యూనివర్శిటీలకు అక్కడి ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోంది.2023 లో భారత్ ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం ఫలితంగా నిర్మాణ రంగం, నర్సింగ్‌ల్లో భారత కార్మికుల కోటా పెరిగింది. నెలవారీ వేతనాలు రూ. లక్ష దాటాయి. దీనికి తోడు వైద్య బీమా వంటి సౌకర్యాలు లభిస్తున్నాయి. ఇటువంటి ప్రయోజనాలు భారత్‌లో లభిస్తాయని ఊహించడం కష్టమే.

ఇదిలా ఉండగా యుద్ధం జరిగే ప్రాంతాల్లో ఉద్యోగాలు, వృత్తులు చేయడం ప్రాణాలతో చెలగాటం. కానీ దీనికి ప్రవాసీయులు భయపడడం లేదు. పైగా యుద్ధం జరిగే చోట పనులు చేస్తే తమకు ఎక్కువ ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. స్వదేశంలో లభించే ఆదాయం కన్నా ఏడాదిలో ఐదు రెట్లు ఆదాయం సంపాదించవచ్చని అంటున్నారు. యుద్ధాల బాధితులమని వారు ఆవేదన చెందడం లేదు. అలా తమను గుర్తించవద్దని స్పష్టం చేస్తున్నారు. ఇటువంటి ప్రవాస భారతీయుల్లో అనేక మంది ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడిన వారే కావడం గమనార్హం. స్వదేశంలో తమకు తగిన వేతనాలు ఎక్కువగా లభిస్తాయన్న ఆశ వారిలో కలగడం లేదు. అందుకే ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధోన్మాద దేశాలైనప్పటికీ, తమ బతుకులకు ఆసరా కల్పించే దేశాలన్న నమ్మకం వారిలో కనిపిస్తోంది.

ఇక భారతీయులను తరలించే రిస్కు ఆపరేషన్లు కూడా వారికి కొత్తేమీ కాదు. 2023 ఏప్రిల్ మే నెలల్లో 3000 మంది కన్నా ఎక్కువ మంది భారతీయులు సూడాన్ నుంచి ఆపరేషన్ కావేరీ ద్వారా విమానాల్లో భారత్‌కు తరలి వచ్చారు. అంతకు ముందు 1990లో మొదటి గల్ఫ్ యుద్ధంలో భారతీయులను తరలించడం జరిగింది. 2015 లో యెమెన్ నుంచి ఆపరేషన్ రాహత్ పేరున, అలాగే 2022లో ఉక్రెయిన్ నుంచి భారతీయ పౌరులను తరలించే ప్రయత్నాలు జరిగాయి. యుద్ధభూముల్లో వ్యక్తిగత భద్రత కన్నా ఆర్థిక భద్రత, కుటుంబ సంక్షేమం ప్రాధాన్యాలుగా ఉంటున్నాయి. పొరుగున ఉన్న గాజాలో యుద్ధ భయానక సంఘటనలు, పౌరుల మరణాలు, విధ్వంసాలు ఎక్కువగా సాగుతున్నప్పటికీ, అవేవీ వీరు పట్టించుకోవడం లేదు. యుద్ధవ్యూహాల కన్నా మనుగడ వ్యూహాలే ముఖ్యం అన్న లక్షం వీరిని యుద్ధభయం లేకుండా ముందుకు నడిపిస్తోంది.

# స్పేస్ పాలసీతో రూ.25 వేలకోట్ల పెట్టుబడులు

### లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీలు
### సమీక్షలో సిఎం చంద్రబాబు



**అమరావతి జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రూ.25 వేల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా స్పేస్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ఏరోస్పేస్ పాలసీపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో . సమీక్షలో ఏరోస్పేస్ టెక్నాలజీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గన్నారు. ఆయన మాట్లాడుతూ స్పేస్ విజన్ 2047 కింద కేంద్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులు చేపడుతోందని, స్టార్‌లింక్, స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజన్ వంటి ప్రైవేటు ఆపరేటర్లు ఈ రంగంలో సంచలనాలు సృష్టించనున్నారని అన్నారు. భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదేనని చెప్పారు. వ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెట్టుబడుల లక్ష్యం నెరవేరితే ప్రత్యక్షంగా ఐదువేల మందికి, పరోక్షంగా 30 వేలమందికి ఉపాధి వస్తుందని తెలిపారు లేపాక్షి, తిరుపతిలలో స్పేస్‌సిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యా సంస్థలను దీనిలో భాగస్వాములను చేయడం ద్వారా విద్యార్థులు ఈ రంగంవైపు ఆకర్షితులయ్యేలా చూడాలని అన్నారు. కమ్యూనికేషన్ రంగంలో ఉన్న సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలన్నారు. తెలిపారు. పెట్టుబడులను రూ.2.5 కోట్ల నుండి రూ.500 కోట్ల వరకూ వేర్వేరు కేటగిరీలుగా విభజించాలని సూచించారు. వారికి 25 శాతం నుండి 45 శాతం రాయితీ ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. లేపాక్షిలో 500 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న స్పేస్ సిటీలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆర్‌అండ్‌డి, స్పేస్ స్టార్టప్, ఇన్నోవేషన్, ఎకోసిస్టమ్, స్పేస్ అప్లికేషన్లు సేవలకు సంబంధించి సంస్థలు ఏర్పాటు చేయనున్నారు. తిరుపతి స్పేస్ సిటీలో తయారీకి, లాజిస్టిక్ సేవలు అందించే సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. లాంచ్‌వెహికల్, శాటిలైట్ పేలోడ్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. శ్రీహరికోట నుండి తిరుపతికి రోడ్ కనెక్టివిటీ అంశంపైనా సిఎం చర్చించారు.

# ఆదాయం పెంపుపై దృష్టి

### ఆర్థికశాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

**అమరావతి జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రానున్న రోజుల్లో వివిధ పథకాల అమలు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన నిధులపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. అలాగే మూలధన వ్యయానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆర్థికశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్థికశాఖ స్థితిగతులు, రాబడులు, ఖర్చులపై సమీక్షించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల ఖర్చు, విడుదలపై చర్చించారు. పింఛన్లతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రతినెలా వెచ్చిస్తున్న ఖర్చుతోపాటు రానున్న రోజుల్లో వివిధ పథకాల అమలుపైనా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. నాబార్డు నుండి నిధులు సమీకరించి పంచాయతీరాజ్‌శాఖపై ఎక్కువ ఖర్చు చేయాలని సిఎం సూచించారు. కేంద్ర కార్యక్రమాల కింద ఇచ్చే నిధులు మూలధన వ్యయానికి ఖర్చు చేయాలని సిఎం అన్నారు. సంక్షేమ పథకాలతోపాటు సంపద సృష్టికి, రెవెన్యూ ఆదాయం పెంచేందుకు అవసరమయ్యే మూలధన వ్యయం మరింత పెంచాలని ఆదేశించారు. ఈ తరహా ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆర్థికశాక మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులు పాల్గన్నారు.

# మోడీ విజన్, చంద్రబాబు ప్లానింగ్‌తో ఏపీ అభివృద్ధి

ఈరోజు ప్రారంభించాం. సీఎం చంద్రబాబు నాయుడుని కలిసి పలు ప్రాజెక్టులపై కూడా చర్చించనున్నాం. ఇరిగేషన్, టూరిజం అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. ప్రణాళిక బద్ధంగా ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తాం అని ఆయన అన్నారు. మరోవైపు, పెహల్గామ్‌లో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఇప్పుడు పర్యాటకులు స్వేచ్ఛగా అక్కడ ప్రాంతాలను సందర్శించ వచ్చు అన్నారు. మరో పదిహేను రోజుల్లో అక్కడ పర్యాటకుల సందడి మొదలవుతుందని కేంద్రమంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనతో పర్యాటక రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. పుష్కర ఘాట్ వద్ద అఖండ గోదావరి ప్రాజెక్టు

రాజమండ్రి అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరం అన్నారు. అలాగే డొక్కా సీతమ్మ, ఆదికవి నన్నయ్యకు జన్మనిచ్చిన నేల గోదావరి ప్రాంతమని పేర్కొన్నారు. మరోవైపు రూ.430 కోట్లతో ఏపీలో పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు.

**యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలతో పర్యాటక రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అభివృద్ధి చేస్తున్నాయని ప్రశంసించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్ర మంత్రి షెకావత్ సహకారం అందించారన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు కోసం షెకావత్ సహకారం అందించారని కొనియాడారు. ఏపీలో 974 కిలోమీటర్ల నదీ తీరం ఉందని, విదేశాల్లో నదీ తీరాలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసిన విధంగా అఖండ గోదావరి ప్రాజెక్టును పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. 2035 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఏపీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

**టూరిజం స్పాట్‌గా హేవలాక్ రైల్వే వంతెన..**

రాజమండ్రి వద్ద గోదావరిపై 127 సంవత్సరాల చరిత్ర ఉన్న హేవలాక్ రైల్వే వంతెనను టూరిజం స్పాట్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. రాజమండ్రి రూరల్ బొమ్మూరులో రూ.15 కోట్లతో నిర్మాణం చేపట్టిన సైన్స్ మ్యూజియాన్ని కేంద్ర మంత్రి షెకావత్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే దివాన్ చెరువు వద్ద రూ.30 కోట్ల వ్యయంతో ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అకాడమీకి శంకుస్థాపన చేయనున్నారు.

పటిష్ట భద్రత ఏర్పాట్లు...

అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వస్తున్న సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ రహితంగా నిర్వహిస్తున్నామని, తాగునీటికి ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు, రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్థానిక నేతలు హాజరయ్యారు.

# అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నశుభాంశు శుక్లా..

ఉండాల్సి వుంది. ఇందుకోసం క్రూ క్యాప్సూల్, అంతరిక్ష కేంద్రాల మధ్య స్థానం, వేగం మరియు దిశను సరిపోల్చడం ద్వారా కచ్చితమైన స్థానికీకరణ తో పాటు సంక్లిష్టమైన ప్రక్రియను చేపట్టాల్సి వుంటుంది. గురువారం సాయంత్రం 4.30గంటలకు (భారత కాలమానం ప్రకారం) మిషన్ కంట్రోల్ 'సాఫ్ట్ క్యాప్చర్'ను నిర్ధారించింది. అంటే అంతరిక్ష నౌక (క్రూ క్యాప్సూల్), అంతరిక్ష కేంద్రాన్ని తాకే సమయంలో ఉత్పత్తి అయ్యే గతిశక్తిని కొంత స్థలాన్ని అనుమతించే కనెక్షన్, నిమిషాల తర్వాత హార్డ్ క్యాప్చర్ అంటే మరింత బలవమైన కనెక్షన్ నిర్ధారించబడింది. అయితే శుక్లాతో పాటు డ్రాగన్ క్యాప్సూల్‌లోని ముగ్గురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోని మిగిలిన ఏడుగురు వ్యోమగాములను వెంటనే చేరుకోరు. స్టేషన్‌తో కనెక్షన్‌ను స్థిరం చేసేందుకు, సీల్‌లో ఎటువంటి విచ్ఛిన్నం జరగకుండా లేదా వ్యోమగాముల భద్రతకు హాని కలిగించే లింక్‌తో ఏదైనా సమస్య లేదని నిర్ధారించుకునేందుకు మరి కొంత సమయం పడుతుంది. ఐఎస్ఎస్, డ్రాగన్ క్యాప్సూల్‌ను వేరుచేసే హాచ్ సాయంత్రం 6.10 గంటలకు (భారత కాలమానం ప్రకారం) తెరుచుకుంటుంది. అనంతరం వారు ఐఎస్ఎస్‌లో 14 రోజుల పాటు ఉండాల్సి వుంటుంది.

# గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం

అడ్డువస్తే తొక్కుకుంటూ వెళ్తామని హెచ్చరించారు. ప్రజా పోలీసింగ్‌తో గంజాయి, డ్రగ్స్ రహిత రాష్టంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి సెలబ్రిటీలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగంపై వాట్సప్ నెంబరు 8977781972, టోల్ ఫ్రీ నెంబరు 1972కు ప్రజలు సమాచారం ఇవ్వాలన్నారు. యువతను గంజాయి, డ్రగ్స్‌కు బానిస చేసి%ౌ% సమాజాన్ని పీడిస్తున్న మాఫియాను తరిమేద్దామని ఈ సందర్భంగా చంద్రబాబు పిలుపునిచ్చారు. 'అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుతున్నాం. ప్రపంచంతో పోటీ పడాల్సి ఉన్న తరుణంలో గంజాయి, డ్రగ్స్ నిషేధంపై దృష్టి పెట్టాల్సి వస్తోంది. ఏజెన్సీ ఏరియాలో గంజాయి సాగు చేసే వారికి ప్రత్యామ్నాయాలు చూపించాం. ఇంకా అదే పని చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని' హెచ్చరించారు. టెక్నాలజీతో డ్రోన్లు వినియోగించి నేర నియంత్ర చేస్తున్నామని, సిసిటివి కెమెరాలతో నేరాలు జరగకుండా చూస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ కట్టడిపై దృష్టి పెట్టలేదని అన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రం డ్రగ్స్‌కు నిలయంగా మారిపోయిందని తెలిపారు. విశాఖ కేంద్రంగా గంజాయి రవాణా చేశారని, ఆంధ్రా బ్రాండ్‌ను దెబ్బ తీశారన్నారు. గత ముఖ్యమంత్రి ఒక్కరోజు కూడా మాదక ద్రవ్యాల నియంత్రణపై సమీక్ష చేయలేదని తెలిపారు. తెనాలిలో గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లతో మాజీ సిఎం చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతున్నారని, వారిని ప్రోత్సహిస్తున్నారని, పరామర్శిస్తున్నారని తెలిపారు. రాజకీయ ముసుగు వేసుకుంటే దాన్ని తొలగించి కట్టడి చేస్తామని, గంజాయి విక్రయించే వారిని.. వారికి సహకరించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రతిపక్షాలూ ముందుకు రావాలని, ప్రజలకు మంచి చేసి ఓట్లు వేయించుకోవాలని, గంజాయి బ్యాచ్‌ను సపోర్టు చేస్తూ తప్పుడు కార్యక్రమాలు చేయొద్దు." అనిహితవు పలికారు.

# అమరావతి రాజధానిలో హెచ్‌ఓడి, జిఏడి

## టవర్ల నిర్మాణాలకు ఎల్‌ఓఏ

అప్పగించారు. ఈ భవనాలను కూడా జిప్లస్ 39 పద్ధతిలో నిర్మించనున్నారు. జిఏడి టవర్ నిర్మాణ పనులను ఎన్‌సిసి సంస్థ దక్కించుకుంది. ఆయా సంస్థల ప్రతినిధులకు అవార్డు పత్రాలు అందించిన అనంతరం కమిషన్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారం పనులు జరగాలని, కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు ఇఎన్‌సి గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ పివిఎస్ భాస్కర్, ఎస్ఈ అంకమ్మచౌదరి, డిఈఈ హేమాబరధరరెడ్డి తదితరులు పాల్గన్నారు.

# అమరావతిలో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు

షాపూర్ జీ పల్లోంజి సంస్థ దక్కించుకుంది. రూ.1487.11 కోట్ల వ్యయంతో ఈ టవర్ల నిర్మాణ పనులు చేపట్టనుంది. ఇంటిగ్రేటెడ్ సచివాలయంలోని 3, 4 హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణ పనులను లార్సెన్ అండ్ టౌబ్రో లిమిటెడ్ దక్కించుకుంది. రూ.1303.85 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టనుంది. ఎల్ 1 బిడ్డర్లకు ప్రతిపాదిత పనులు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సీఆర్డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

# చేనేత సహకార సంఘాల బకాయిలు చెల్లించండి

✓ కార్మికులకు మూడు సెంట్లు స్థలం ఇవ్వడంతోపాటు, మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు ఇవ్వాలని, ప్రయివేట్ రంగంలోని చేనేత కార్మికులకు త్రిఫ్ట్‌ఫండ్ స్కీంను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు అమలు చేయాలని, చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, సహకార సంఘాల అప్పులు రద్దు చేయాలని, ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఇంట్లో మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్, సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.156 కోట్లు, త్రిఫ్ట్‌ఫండ్ రూ.ఐదు కోట్లు వెంటనే విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శివదుర్గారావు, పి.బాలకఅష్ణ, నాయకులు డి.రామారావు, ఎ.వీరబ్రహ్మం, కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

# కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు

నుంచి నిధులు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు. ఎన్‌సీడీ బాండ్లకు అదనపు హామీగా, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి అయిన ఖనిజ సంపదను కేవలం రూ. 9,000 కోట్ల బాండ్ల కోసం తాకట్టు పెట్టిందని జగన్ విమర్శించారు. రాష్ట్ర సంఘటిత నిధికి ఇలా ప్రైవేటు వ్యక్తులకు అనుమతి ఇవ్వడం, ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం చూస్తుంటే, ఈ బాండ్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రాష్ట్ర అభివృద్ధి రుణాల (ఎస్‌డీఎల్) కంటే ఎక్కువ సురక్షితమైనవిగా భావించాలా? అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ఏపీఎండీసీ బాండ్లను 9.30 శాతం అధిక వడ్డీ రేటుకు జారీ చేశారని, ఇది ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి రుణాలపై ఉన్న వడ్డీ రేటు కంటే 2.60 శాతం ఎక్కువని జగన్ తెలిపారు. ఈ అధిక వడ్డీ రేటు కారణంగా ఏపీఎండీసీపై ఏటా అదనంగా రూ. 235 కోట్ల భారం పడుతుందని, ఈ బాండ్ల కాలపరిమితి పదేళ్లుగా ఉందని తెలిసిందని అన్నారు. ఈ అదనపు భారం వల్ల లబ్ధి పొందింది ఎవరో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ ఎన్‌సీడీల జారీతో, టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 13 నెలల కాలంలో సమీకరించిన బడ్జెట్, ఆఫ్-బడ్జెట్ రుణాలు, గత ప్రభుత్వం ఐదేళ్లలో తీసుకున్న రుణాల్లో 50 శాతానికి పైగా ఉన్నాయని జగన్ ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ప్రభుత్వ రుణాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## 21వ వార్డులో

# జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

### జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్




విశాఖపట్నం జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన 3వ జోన్ 21వ వార్డు చిన్న వాల్తేరు లోని మసీదు వీధి, విజయనగర్ కాలనీ, నేతాజీ నగర్, కొయ్య వీధి, చిన్న వాల్తేర్ అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు.**

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రత కాలువలోని వ్యర్థాల తొలగింపు మొదలైనవి ప్రతిరోజు విధిగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 21వ వార్డులో పలుచోట్ల కాలువలలో పారుతున్న మురుగునీటిని పరిశీలించి నిత్యం కాలువలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డులోని ఉన్న పుష్కార్ట్లను పరిశీలించి వాటిని అన్నిచోట్ల వినియోగించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్ ను ఆదేశించారు. కొయ్య వీధిలోని ప్రధాన కాలువలోని జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించి వర్షాకాలంలో గెడ్డలు పొంగిపొరలకుండా కాలువలోని వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్ కు కమిషనర్ ఆదేశించారు.

మసీద్ వీధిలోని కాలువలు, రోడ్లు పై భవన నిర్మాణ వ్యర్థాలను గమనించి వాటిని యుద్ధ ప్రాతిపదికపై తొలగించి వాటి ఫోటోలను అప్లోడ్ చేయాలని ప్లానింగ్ కార్యదర్శిని ఆదేశించారు. కొత్తగా భవనాలు నిర్మిస్తున్న భవన నిర్మాణదారులు వారి భవనాలు పూర్తి అయ్యేవరకు ఆయా భవన నిర్మాణాలను పూర్తిగా కప్పి ఉంచాలని, అలాగే భవన నిర్మాణ సామాగ్రిని రోడ్లపై వేయకుండా భవనాల కాంపౌండ్ వాల్ లోపల వేసేలా చర్యలు చేపట్టాలని జోనర్ కమిషనర్ ను ఆదేశించారు.



వీధులలో తాగునీరు సమస్య పైన వీధి దీపాల నిర్వహణ పైన స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో సోలార్ వీధిలైట్ల తో సహా మొత్తం 331 వీధిలైట్లు ఉన్నాయని వాటిలో 16 వీధిలైట్లు వెలగడం లేదని వార్డు ఇమ్యూనిటీ కార్యదర్శి కమిషనర్ కి వివరించగా అన్ని వీధిలైట్లు వెలిగేలా నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు.

దుకాణాల ముందు ఉన్న డస్ట్ బిన్లను పరిశీలించి ప్రతి దుకాణం దుకాణాలతో తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని రోడ్లను, ఫుట్ పాతులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించరాదని వ్యాపారస్తులను ఆదేశించారు. వార్డులోని ఎన్ని నివాసాలకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కలిగి ఉందని ఎమినిటీ కార్యదర్శులను అడిగి తెలుసుకుని శత శాతం అన్ని నివాసాలకు భూగర్భమైనది వ్యవస్థ కలిగి ఉండాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.రోడ్డుపై ఉన్న మ్యాన్ హోల్స్ లో వ్యర్థాలు పడకుండా జాలీలను అమర్చాలన్నారు.

అనంతరం చిన్న వాల్తేరు లోని మెంటల్ హాస్పిటల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ పరిశీలించి ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లో పరిశుభ్రతతో పాటు వేడివేడిగా ఆహారాలను అందించాలన్నారు. రోజుకు ఎంతమంది అన్నా క్యాంటీన్ ను వినియోగించుకుంటున్నారని నిర్వాహకులను ఆరా తీశారు. వాష్ బేసిన్లు, టాయిలెట్లు, పరిసరాల పరిశుభ్రత,టోకెన్ సిస్టం, వడ్డింపులను స్వయంగా పరిశీలించి అన్న క్యాంటీన్లోని విధులు నిర్వహిస్తున్న వారికి సకాలంలో జీతాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిత్యం వేడి ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు.

ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ఏ ఎమ్ ఓ హెచ్ బి.ప్రసాద్ రావు, కార్యనిర్వహక ఇంజనీరు గంగాధర్, సుధాకర్, పద్మావతి, ఉప కార్య నిర్వహక ఇంజనీరు వెల్సన్, ఏపీడి రాము, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## వీధి విక్రయదారుల నగర కమిటీ

## అనధికారుల సభ్యత్వానికి దరఖాస్తులు స్వీకరణ

### 3వ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్

విశాఖపట్నం జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**వీధి విక్రయ దారుల నగర కమిటీ అనధికారుల సభ్యత్వం కొరకు దరఖాస్తులను ఆహ్వానించడమైనదని జోన్- 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.**

వీధి విక్రయదారుల చట్టం 2014 జీవో నెంబర్ 137 ప్రకారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో వీధివిక్రయ దారుల నగర కమిటీలో నలుగురు అనధికార సభ్యులను వివిధ వ్యాపార వృత్తికి చెందినవారు మరియు నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ -1, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ ఎంపిక/నామినేషన్ విధానం ద్వారా 3 సంవత్సరాల కాల పరిమితి గల కమిటీని ఎంపిక చేయుటకు స్ట్రీట్ వెండర్ అసోసియేషన్స్, మార్కెట్ అండ్ ట్రేడ్ అసోసియేషన్, రిజిస్టర్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ లైక్ టౌన్ లెవెల్ ఫెడరేషన్ లీడర్, నివాసిత సంక్షేమ సంఘం నుంచి దరఖాస్తులు ఆహ్వానించడమైనదని, ఈ దరఖాస్తులను నోటిఫికేషన్ ఇచ్చిన 07 రోజులలో రిజిస్టర్ పోస్టు ద్వారా గాని నేరుగా యు సి డి విభాగం 3వ జోన్ అశీలమెట్ట జీవీఎంసీ కార్యాలయము నందు గల డ్రాప్ట్ బాక్స్ లో తేదీ జూన్ 27, 2025 నుండి జూలై 02, 2025 సాయంత్రం 5 గంటలు లోగా దాఖలు చేయవలెనన్నారు. దరఖాస్తు నమూనా ఇతర వివరాలు జీవీఎంసీ 3వ జోన్ కార్యాలయంలో పొందవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం పని దినాలలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ (యు.సి.డి) ఎల్.రాము ను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

# టూవీలర్లకు టోల్ ఫీజు..

### క్లారిటీ ఇచ్చిన నితిన్ గడ్కరీ



**ఢిల్లీ : జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు కూడా టోల్ ఫీజు వసూలు చేయాలని కేంద్రం నిర్ణయించిదంటూ వచ్చిన వార్తలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. జులై 15 నుంచే అమల్లోకి తీసుకురానున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టంచేశారు. టూవీలర్లకు టోల్ వసూలు చేసే ఉద్దేశమేదీ లేదని పేర్కొన్నారు.**

కొన్ని మీడియా సంస్థలు ద్విచక్ర వాహనాలపై టోల్ పన్ను విధించడం గురించి తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేస్తున్నాయని తప్పుబట్టారు. టోల్ పన్నుపై పూర్తి మినహాయింపు కొనసాగుతుందని చెప్పారు. వాస్తవాలు తెలీకుండా తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేయడం సరికాదని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఏఐ కూడా ఇదే తరహా ప్రకటన విడుదల చేసింది. టోల్ ఫీజు ప్రతిపాదనేదీ లేదని స్పష్టంచేసింది.

## పహల్గాం ప్రస్తావన లేకుండా షాంఘై సహకార సంస్థ పత్రం..

# చైనా సదస్సులో సంతకం చేయని రాజ్‌నాథ్ సింగ్

**చైనా : చైనా పర్యటనలో ఉన్న భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ఆయన కీలక ప్రసంగం చేశారు. సమావేశం అనంతరం దీనిపై జాయింట్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశారు. అయితే, అందులో పహల్గాం ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది.**




చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు. ఇందులో భారత్, చైనా, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం రూపొందించిన జాయింట్ డాక్యుమెంట్.. ఉగ్రవాదంపై భారత కఠిన వైఖరిని సుస్పష్టంగా ప్రతిబింబించలేకపోయింది. అంతేగాక, ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఘటనను అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్‌ను నిందించే ప్రయత్నం జరిగింది.

దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా ఉన్న ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఉగ్రవాద అంశంపై సదస్సులో భిన్నాభిప్రాయాలు రావడంతో సమావేశం అనంతరం రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఆర్గనైజేషన్ రద్దు చేసింది. పాకిస్థాన్ వల్లే ఈ జాయింట్ డాక్యుమెంట్ నుంచి పహల్గాం ప్రస్తావనను మినహాయించి ఉంటారనే సంకేతాలు కన్పిస్తున్నాయి. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది. అంతకుముందు ఈ సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా వాడుకుంటున్నాయని పరోక్షంగా దాయాదిని దుయ్యబట్టారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకుతగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పవన్నారు.

పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ రక్షణమంత్రులు ఎదురుపడటం ఇదే తొలిసారి. అయితే, ఈ సదస్సులో వీరిద్దరి మధ్య ఎలాంటి పలకరింపులు జరగలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇక, 2020లో గల్వార్ ఘర్షణ తర్వాత నుంచి భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ ఆర్గనైజేషన్‌లో బెలారస్, చైనా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

## రాజ్యాంగమే అత్యున్నతమైంది..

# పార్లమెంట్ కాదు: సీజేఐ గవాయ్



**ఢిల్లీ : భారత్‌లో రాజ్యాంగమే అత్యున్నతమైందని.. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలు దాని కిందే పనిచేస్తాయని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రిన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంట్‌కు అధికారాలున్నాయి. కానీ, రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం అది మార్చలేదన్నారు. భారత 52వ సీజేఐగా గవాయ్ గత నెల బాధ్యతలు స్వీకరించారు. తూర్పు మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.**

శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల్లో ఏది అత్యున్నతమైందని తరచూ చర్చ తలెత్తుతోందని గవాయ్ అభిప్రాయపడ్డారు. “ చాలామంది పార్లమెంట్ అత్యున్నతమైందని అంటారు. కానీ, నా ఉద్దేశంలో భారత రాజ్యాంగమే అత్యంత ముఖ్యమైంది. ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు దానికిందే పనిచేస్తాయి. మనం విధులు నిర్వహిస్తున్నామని న్యాయమూర్తులు ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి. మనం ప్రజల హక్కులకు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం. కేవలం మనకు అధికారం మాత్రమే లేదు. బాధ్యతలు కూడా ఉన్నాయి. తీర్పుల గురించి ప్రజలు ఏమనుకొంటున్నారు అన్నది జడ్జీలను ప్రభావితం చేయకూడదు. మనం స్వతంత్రంగా ఆలోచించాలి” అని పేర్కొన్నారు. తాను రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు అండగా నిలుస్తానన్నారు.


బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు మీద ఆయన స్పందించారు. ప్రతిఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలన్నారు. చిన్నప్పుడు తాను ఆర్కిటెక్ట్ కావాలనుకొన్నట్లు చెప్పారు. కానీ, తాను లా చదవడం తన తండ్రి కోరిక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన అరెస్టు కావడంతో.. లా చదవలేకపోయారన్నారు.

# పర్యాటక రంగంలో మెండుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

**-శక్తిమంతమైన నాయకులు, ప్రభుత్వంతోనే అభివృద్ధి-డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్ర ప్రగతి పరుగులు -రూ.430 కోట్లతో పర్యాటక ప్రాజెక్టులకు శంకుస్థాపన-అఖండ గోదావరి ప్రాజెక్ట్ పూర్తయితే 4 లక్షల మందికి ఉపాధి-రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రి షెకావత్ మద్దతు మరువలేనిది-అఖండ గోదావరి ప్రాజెక్టుకు కేంద్రమంత్రితో కలంతిసి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన**







**రాజమహేంద్రవరం, జూన్ 26(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

'రాష్ట్ర అభివృద్ధిలో పర్యాటక రంగం చాలా కీలకమని, ఈ రంగంలో యువతకు ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 4 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. శక్తివంతమైన నాయకులు, ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగవంతమవుతుందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్ర ప్రగతి పరుగులు పెడుతుందన్నారు. రూ.430 కోట్లతో ఈ రోజు రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నామని, త్వరలోనే రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలియచేశారు. గురువారం స్థానిక పుష్కరఘాట్‌లో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌కు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్రం నిధులు రూ.375 కోట్లతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టనున్న ప్రాజెక్టులకు సంబంధించిన ఫోటో గ్యాలరీని తిలకించారు. గోదావరి తీరం రివర్ ఫ్రంట్ వ్యూ పాయింట్ నుంచి అఖండ గోదావరి ప్రాజెక్టు చేపట్టబోయే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అంటే గుర్తొచ్చేది గోదావరి తీరం అన్నారు. నది తీరం వెంట నాగరికత, భాష అన్నీ అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మకు జన్మనిచ్చిన ప్రాంతం, భారతాన్ని తెలుగులో అనువదించానికి శ్రీకారం చుట్టిన ఆదికవి నన్నయ్య నడియాడి ప్రాంతమన్నారు. ప్రముఖ రచయిత ముళ్ళపూడి వెంకట రమణ నడయాడిన నేల అని, ఎందరో కళాకారులకు, సామాజికవేత్తలకు జీవితాన్ని ప్రసాదించిన నేల అన్నారు. ఈ నేల ప్రజలందరి ఆకలి తీరుస్తూ అన్నపూర్ణగా పేరు గాంచింది అన్నారు.

## సమగ్ర అభివృద్ధి సాధించేలా పని చేస్తాం

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమిగా ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీజేపీ నాయకులు, తాము ముందుగా అనుకున్నది ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి సాధించేలా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ముఖ్యంగా పర్యటక రంగంలో ఇరత రాష్ట్రాలతో పోటీ పడేలా ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలనుకున్నామని, అందులో భాగంగానే ఈ అఖండ గోదావరి ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశామన్నారు. ఈ ప్రాజెక్టుకు గౌరవ ప్రధాన మంత్రివర్యులు నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రివర్యులు గజేంద్ర సింగ్ షెకావత్‌అందిస్తున్న తోడ్పాటు మరువలేనిది అన్నారు. ప్రాజెక్టుకు రూపం తీసుకొచ్చిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్, వారి శాఖా అధికారులను, ఈ ప్రాజెక్టు మంజూరు కావడంలో తన పూర్తి సహాయ సహకారాన్ని అందించిన పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రివర్యులు గజేంద్ర సింగ్ షెకావత్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి మద్దతు ఇవ్వడం ఇది తొలిసారి కాదని, ఆయన ఎన్నోసార్లు మన రాష్ట్రానికి అండగా నిలబడ్డారు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్ అంశంగా మారిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలువరించాం అంటే దానికి బీజం వేసింది ఆయనే అన్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు తమ వంతు సహకారం అందించారని, ఇప్పుడు కూడా రాష్ట్ర అభివృద్ధికి ఆయన ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు అన్నారు. రాణా ప్రతాప్, దుర్గాదాస్ రాథోర్ వంటి వీరులు పుట్టిన రాజస్థాన్ నేలపై ఆయన జన్మించారు అని, అలాంటి పౌరుషం ఉన్న ఆయన ... మన పౌరుషాల గడ్డను అర్థం చేసుకోగలరు అన్నారు.

## పర్యాటక కేంద్రాలకు పునరుజ్జీవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, అలాగే గోదావరి, కృష్ణా, వంశధార వంటి నదీ తీరాలు ఉన్నాయన్నారు. మిగతా దేశాల్లో అయితే హొటళ్లు, రెస్టారెంట్లు వంటివి పెట్టి అభివృద్ధి చేస్తారు అని, మన దేశంలో మాత్రం నదులు మన జీవన విధానం, సంస్కృతిలో భాగం అని, అందుకే అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా పుష్కరాల రేవును ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఘాట్‌లో ఉన్న ఆలయాల విశిష్టత తెలియజేసేలా ఏర్పాట్లు చేయడంతో పాటు గోదావరి హారతి ఇచ్చేలా తీర్చిదిద్దుతామన్నారు. హేవలాక్ వంతెనకు 127 ఏళ్ల చరిత్ర ఉందని, బ్రిడ్జ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని దశాబ్దాలుగా ఉన్న ఆకాంక్షను సాకారం చేస్తున్నామన్నారు. రాజహేంద్రవరం చరిత్ర, విశిష్టతలు, కళారంగాలు ఇలా వివిధ థీమ్‌లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు చుట్టుపక్క ప్రాంతాలను అభివృద్ధి చేసి 2035 నాటికి 35 లక్షల మంది పర్యాటకులను ఆకర్షించేలా అఖండ గోదావరి ప్రాజెక్ట్‌ను తీర్చిదిద్దుతున్నాం అన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి : కేంద్రమంత్రి షెకావత్

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రివర్యులు గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. . గౌరవ ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో దేశంలో పర్యాటక అభివృద్ధి ఎంతో వేగంగా జరుగుతోంది అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోంది అన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అనేక అనుకూల పరిస్థితులు ఉన్నాయి అన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రూ.94.44 కోట్లతో రాజమహేంద్రవరం, కడియం, నిడదవోలు పరిసర ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాము అన్నారు. ఇందులో భాగంగా 127 ఏళ్ల చారిత్రక నేపథ్యం కలిగిన హేవ్‌లాక్ వంతెనను ఆదునీకరించడమే కాకుండా దానిని పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట రాజు, గిడ్డి సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, టూరిజం శాఖ కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్, పర్యాటక శాఖ, కార్పొరేషన్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు







## జిల్లా పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి.




**ఏలూరు,జూన్, 26, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏలూరులోని జిల్లాపరిషత్ ఆవరణలో జెడ్పి నిధులు రూ. 55 లక్షలతో డ్రైయిన్, తారురోడ్డు నిర్మాణాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి శంఖుస్థాపన చేశారు. తొలుత జిల్లా పరిషత్ ఆవరణలోగల జాతీయ నాయకుల విగ్రహాలకు రూ. 5 లక్షలతో ఏర్పాటుచేసిన లాడర్స్ ను ఆయన ప్రారంభించారు. అదే విధంగా మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. ఎన్.టి.ఆర్. విగ్రహానికి ఏర్పాటు చేసిన లాడర్ ను కూడా ప్రారంభించి ఎన్.టి.ఆర్. విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, జ్యోతిరావ్ పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ రామ్, మధర్ థెరీస్సా, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు జాతీయ నాయకుల విగ్రహాల వద్దకు వెళ్లి సత్కరించుకునేందుకు రెయిలింగ్ తో కూడిన మెట్లను ఏర్పాటుచేయడం అభినందనీయమని మంత్రి పార్ధసారధి అన్నారు. కార్యక్రమంలో జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఆప్కాబ్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, జెడ్పి సిఇఓ ఎం. శ్రీహరి, ఎస్సీఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, పలువురు జెడ్పిటిసిలు, స్ధానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్ళు

**-జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ**



**ఏలూరు,జూన్ 26, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉభయ జిల్లాలు అధికారులు కలిసికట్టుగా పనిచేసి ఏలూరు జిల్లాను అగ్రగామిగా నిలపాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఛాంబరులో గురువారం జిల్లా పరిషత్తు సిఇవో, ఉభయ గోదావరి జిల్లాల అధికారులు, జిల్లా జడ్పీటిసి సభ్యులతో ఉభయజిల్లాల జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన 1 నుండి 7 వ స్థాయిసంఘ సమావేశాలు ఉభయజిల్లాలో మండలాల వారీగా మంజూరైన పనులు, ప్రగతి,పెండింగు పనులు,ఉన్న సమస్యలుపై సుదీర్ఘంగా సమీక్షంచారు.గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు, ఈ రోజు సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా చూసి, ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుచున్నారని అన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించుటకు అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అమలులో అధికారులు పాత్ర కీలకమైనదని అన్నారు. జిల్లాలో మంజూరైన పనులు వేగంగా జరుగుచున్నాయని, కొన్ని పనులు పెండింగ్లో ఉన్నవి మొదలు పెట్టాలని ఆదేశాలు జారీ చేశామని,నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసి ప్రజలకు వాడుకలోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా పరిషత్తు సమావేశాలకు జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, హాజరు కాకపోతే పనులు ముందుకు సాగవని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని,అప్పుడే పనులు నాణ్యతతో పూర్తి అయ్యి వాడుకలోకి తెస్తే ప్రజలు సంతోషపడతారని అన్నారు. అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు,ముఖ్యమైన కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని, శిలాఫలకాల పై ప్రోటోకాల్ ప్రకారం పేర్లు ఉండాలని అన్నారు. ప్రోటోకాల్ సరిగ్గా పాటించని అధికారులను శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి కార్యక్రమాలలో పనులు నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులను,కాంట్రాక్టర్లను బాధ్యులను చేసి,బిల్లులను పెండింగులో పెట్టి తక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇవో యం. శ్రీహరి, ఉభయ గోదావరి జిల్లాలు వివిధ శాఖల అధికారులు, జడ్పీటిసి సభ్యులు, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ర్యాలీ




**చింతలపూడి, జూన్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి ):**
ప్రపంచ మత్తు పదార్థాల నివారణ దినోత్సవం సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ చింతలపూడిలో విద్యార్థిని విద్యార్థులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు, ప్రజలతో కలిసి పోలీస్ శాఖ గురువారం ర్యాలీ నిర్వహించింది. చింతలపూడి సిఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం అనేది తాత్కాలిక మత్తే కానీ దీని ఫలితం జీవితాంతం బాధేనని అన్నారు. యువత తమ విలువైన జీవితాలను మత్తు పదార్థాలకు బలి చేయకూడదని అన్నారు. మత్తు పదార్థాలపై శాశ్వతంగా పోరాటం చేయాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యవసరం" అని ఆయన పేర్కొన్నారు. ప్రతి దేశానికి యువత వెన్నెముకులాంటి వారిని అటువంటివారిని నిర్వీర్యం చేయటానికి దుష్ట శక్తులు ఇటువంటి మత్తు పదార్థాలకు యువతను గురి చేస్తారని, యువత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీసు శాఖ డ్రగ్స్ సరఫరా, వినియోగంపై గట్టి పర్యవేక్షణ జరుపుతూ, ఏలూరు జిల్లా అంతటా మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు చేపడుతోంది. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజాన్ని మేల్కొలిపే దిశగా ముందడుగు వెయ్యాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎస్సై సతీష్ కుమార్, కూటమి నాయకులు మాటూరి వెంకట రామయ్య, తాటి అప్పారావు, కొత్తపూడి శేషగిరిరావు, బోడ నాగభూషణం, కనమతరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గుమ్మిశెట్టి భారతి, డాక్టర్ సొంగా ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఎస్సీ విభాగం అధ్యక్షులుగా సాధనాల



**పి గన్నవరం, జూన్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మేరకు పి. గన్నవరం నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులుగా సాధనల రమేష్ ను నియమించారు. ఈయన పార్టీ ఆవిర్భావ నుండి పార్టీకి అనేక ప్రభుత్వ వ్యతిరేక విధానాలు పై పోరాటాలు చేసి పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. మండల పార్టీ ఉప అధ్యక్షుడుగా, నగరం మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులుగా వ్యవరించారు. ఈయనకు ఈ పదవి ఇవ్వడానికి కృషి చేసిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావులకు రమేష్ కృతజ్ఞతలు తెలియజేసారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణు గోపాల్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, మాజీ అధ్యక్షులు నక్క వెంకటేశ్వర రావు, అడ్డగాళ్ల సాయిరామ్, దోమ్మేటి శివరావు, పితాని నరసింహరావు, కుంపట్ల గోపివడలి కొండయ్య, మెల్లం ప్రసాద్, గిడ్డి రాంబాబు, జల్లి పండు, పెచెట్టి రాంబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

# మారకద్రవ్యాల మత్తులో యువత జీవితాలు చిత్తు చిత్తు- ఎస్సై సంతోష్ కుమార్



**వి ఆర్ పురం, జూన్ 26(తెలుగు రాష్ట్రం విలేఖరి):**
అంతర్జాతీయ మారకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా యస్ ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వి ఆర్ పురం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నుండి రేఖపల్లి ప్రధాన కూడలి వరకు ర్యాలీ ద్వారా యాంటీ డ్రగ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీ లో డ్రగ్స్ వదులుకో - యువత మేలుకో,అరికట్టాలి అరికట్టాలి డ్రగ్స్ ను అరికట్టాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక యస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ మారక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను యువతకు, మండల ప్రజలకు వివరించారు. యుక్త వయస్సులో ఉన్నప్పుడే కొందరు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తుంటారు. కొత్త ప్రయోగాలతో ప్రమాదాలు తెచ్చుకుంటున్నారు. ఎక్కువగా ఇలాంటి సమయంలోనే మత్తు పదార్థాలకు అలవాటు పడుతుంటారు. ఆడ మగా అని తేడా లేదు అమ్మాయిలు కూడా మత్తుకు బానిసలవుతున్నారని అన్నారు. ఒక్కసారి అలవాటు పడితే మత్తు ముంచేస్తుంది. దీని బారిన పడి ఎంతో మంది చిక్కుల్లో పడుతున్నారు. తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తులో ఆడపిల్లలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

## -బీజేపీ నాయకురాలు కంభంపాటి మాధవి



**విజయవాడ, జూన్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
వికసిత్ భారత్ 11 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా పట్టణంలో బీజేపీ నాయకురాలు, సామాజిక వేత్త కంభంపాటి మాధవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోసేవా సుపరిపాలన, పేదల సంక్షేమం, దేశంలో, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పి.గన్నవరంలో ఇంటర్నేషనల్ డ్రగ్స్ డే అవగాహన ర్యాలీ



**పి.గన్నవరం, జూన్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
అంతర్జాతీయ డ్రగ్స్ డే సందర్భంగా మూడు రోడ్ల జంక్షన్లో గురువారం మాదక ద్రవ్య నిర్మూలన కోసం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సీఐ విద్యార్థులతో డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్ధాల గురించి విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ నిందుతులను పట్టుకోవడానికి వెళ్తూ ప్రమాదానికి గురైన ఆలమూరు ఎస్సై, కానిస్టేబుల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమెల్యే గిడ్డి సత్యనారాయణ వచ్చి డ్రగ్స్ వాడ వద్దని,డ్రగ్స్ వాడటం వలన మొత్తం కుటుంబం నాశనం అవుతుందని తెలిపారు. అనంతరం పి,గన్నవరం పోలీస్ స్టేషన్ వద్దకు విద్యార్థులతో ర్యాలీగా వచ్చి మానవహారం గా ఏర్పడి డ్రగ్స్ వాడవద్దు జీవితాన్ని నాశనం చేసుకొద్దు అని నినాదం చేసారు. ఈ కార్యక్రమానికి సిఐ తో పాటు పార్లమెంట్ పరిధిలో ఎస్ఐలు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రచారం



**జీలుగుమిల్లి, జూన్ 26(తెలుగురాష్ట్రం విలేకరి):**
మండలంలో యువతను గంజాయి, ఇతర డ్రగ్స్ ఉచ్చు నుండి రక్షించేందుకు ఒక విస్తృత అవగాహన కార్యక్రమం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా వచ్చి జగదాంబ గుడి సెంటర్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ఈ ప్రచారాన్ని చేపట్టినట్లు తెలిపారు. యువత ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా వారి స్నేహితులే కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. "మీ స్నేహితుడు గంజాయి లేదా డ్రగ్స్ కు బలికాకుండా రక్షించుకోండి" అనే నినాదంతో ఈ ప్రచారం చేశారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా డ్రగ్స్ వినియోగం గురించి సమాచారం తెలిస్తే తక్షణమే 1972 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమాజంలో డ్రగ్స్ భూతాన్ని పూర్తిగా తరిమికొట్టాలి. ఈ ప్రచారం ద్వారా యువతలో మార్పు తీసుకురావడమే తమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించమన్నారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలవరం డిఎస్పి, వెంకటేశ్వరరావు, సిఐ బి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నిఖిల్ , ఎమ్మార్వో ఉదయ్, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, సర్పంచ్ చిర్రి జగదాంబ, సెక్రటరీ అశోక్, కోల మధు, పాలోజి ప్రసాద్, కొప్పుల సత్యనారాయణ, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత మండలంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం అంతిమ లక్ష్యమని తెలియజేశారు.

# తిరుమల ఉద్యోగులకు హెల్మెట్ల పంపిణీ



**అమలాపురం, జూన్ 26(తెలుగురాష్ట్రం విలేకరి):**
అమలాపురానికి చెందిన దాత నిమ్మకాయల సత్యనారాయణ సహకారంతో తిరుమలలోని టీటీడీ ఉద్యోగులకు 2000 హెల్మెట్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పంపిణీ చేశారు. తిరుమలలోని చైర్మన్ అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల భద్రత నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అమలాపురంకు చెందిన వ్యాపారవేత్త, దాత నిమ్మకాయల సత్యనారాయణ 15 లక్షల రూపాయిల వ్యయంతో ఈ హెల్మెట్లను సమకూర్చి టీటీడీకి అందజేసారు. టీటీడీలోని వాహనాలు నడిపే 10 వేల మంది ఉద్యోగులకు వారి భద్రతలో భాగంగా హెల్మెట్లను ఉచితంగా అందించాలని భావించామని, ఈ కార్యక్రమానికి పెద్దమనస్సుతో నిమ్మకాయల సత్యనారాయణ సహకరం అందించడం పట్ల చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమలతో దాత ముందు ప్రయాణం చేయాలని కోరారు. తిరుమలలో తనకు శ్రీవారి సేవను వివిధ రూపాల్లో చేసుకొనే అదృష్టాన్ని ప్రసాదించిన చైర్మన్ బీఆర్ నాయుడికి, అధికారులకు, పాలక మండలికి, కార్యక్రమానికి సహకరించిన నాగేంద్ర ప్రసాద్ కి దాత సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రపంచ మాదకద్రవ్య దుర్వినియోగ దినోత్సవ ర్యాలీ




**చింతూరు, మే 26(తెలుగు రాష్ట్రం విలేకరి):**
కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ప్రపంచ మాదకద్రవ్య దుర్వినియోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్య దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచడం మరియు ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడం వివరించారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులు విద్యార్థులు హాజరైన ఈ ర్యాలీలో మాదకద్రవ్య దుర్వినియోగంతో సంబంధం ఉన్న ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం మరియు వ్యసనంతో పోరాడుతున్న వారిని సహాయం కోరేలా ప్రోత్సహించడం లక్ష్యం అని అని అన్నారు. ర్యాలీ అవగాహన, మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాటంలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించలని సూచించారు. మాదకద్రవ్య దుర్వినియోగాన్ని నిరోధించడంలో మరియు ఆరోగ్యకరమైన మాదకద్రవ్య రహిత సమాజాన్ని ప్రోత్సహించడంలో ప్రాముఖ్యతను ఈ కార్యక్రమంలో వివరించారు. మాదకద్రవ్య దుర్వినియోగం బారిన పడిన వారి జీవితాల్లో మనం కలిసి మార్పు తీసుకురావచ్చు. ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజం కోసం పనిచేద్దామని అని అన్నారు. మాదకద్రవ్య దుర్వినియోగాన్ని ఎదుర్కోవడంలో మరియు మాదకద్రవ్య రహిత సమాజాన్ని ప్రోత్సహించడంలో ప్రయత్నాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేయడంతో ర్యాలీ ముగిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణారావు గైనకాలజిస్ట్, డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ స్పందన, డా మహేష్ ఎస్ ఎన్ సి యూ మెడికల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ పాల్గొనాలి. -ఎమ్మెల్యే బండారు.



**కొత్తపేట, జూన్ 26(తెలుగు రాష్ట్రం విలేకరి):**
మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఈ దిశగా కఠిన చర్యలు చేపడుతోందని, గంజాయి ఆంధ్రప్రదేశ్ అనే మచ్చను తొలగించి అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తుందని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక మంత్రుల కమిటీ ఏర్పాటై నిత్యం పర్యవేక్షణ చేస్తోందని, డ్రోన్లు, జీపీఎస్ ట్రాకింగ్, బ్లాక్‌చైన్ ఆధారిత సీసీ టీవీలు వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులతో గంజాయి సాగు, రవాణాపై నిఘా ఉంచబడుతోందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన అవగాహన కార్యక్రమాల ద్వారా గంజాయి సాగు 1100 ఎకరాల నుండి 100 ఎకరాలకు తగ్గిపోయిందని అన్నారు. యువతలో పెరుగుతున్న డ్రగ్స్, మద్యం వినియోగం భవిష్యత్తుకి తీవ్ర అడ్డంకిగా మారుతోందని, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, సేవా సంస్థలు కలిసికట్టుగా అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, ఇలాంటి వ్యసనాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని చెప్పారు. భారతదేశాన్ని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను మత్తు పదార్థాల బానిసత్వం నుండి విముక్తి చేయాలంటే ప్రజల సహకారం కీలకమని అన్నారు. డ్రగ్స్‌పై అవగాహన పెంచుతూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. గంజాయి బానిసలుగా మారి పోలీసులపై దాడులకు పాల్పడిన వారిని పరామర్శించడాన్ని ప్రోత్సహించేలా వ్యవహరించడం తగదని, వైసీపీ నేత జగన్‌మోహన్ రెడ్డి ఈ రకమైన ప్రవర్తనను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

# మోడీ పాలనపై స్ట్రీట్ కార్నర్ ద్వారా అవగాహన



**కాట్రేనికోన,జూన్ 26(తెలుగు రాష్ట్రం విలేకరి):**
కాట్రేనికోన మండలం చెయ్యేరులో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల అమృతకాల పరిపాలనపై స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్,కరోనా సమయంలో ఉచిత రేషన్, మెడికల్ క్యాంప్ ద్వారా ఉచిత వ్యాక్సిన్, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ త్రాగునీరు, ఎన్ ఆర్ ఈ జి ఎస్ ద్వారా లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పన,సర్వ శిక్ష అభియాన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన మండల బిజెపి అధ్యక్షులు మట్ట శివకుమార్, జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, అసెంబ్లీ కన్వీనర్ గొల కోటి వెంకటరెడ్డి ,జిల్లా ప్రధాన కార్యదర్శి గెంశెట్టి వెంకటేశ్వరరావు, మట్ట సూరిబాబు, నంద్యాల చంటి, కొత్తలంక సురేష్, మండల ప్రధాన కార్యదర్శి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
జూన్ 27,
శుక్రవారం 2025


# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో నలుగురు టీమిండియా ఆటగాళ్లు! ఎవరెవరంటే..?

**ఐసీసీ తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్ళు అద్భుత ప్రదర్శన చేశారు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో, రవీంద్ర జడేజా ఆల్‌రౌండర్‌గా అగ్రస్థానంలో ఉన్నారు. యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ టాప్ 10 బ్యాట్స్‌మెన్లలో చోటు దక్కించుకున్నారు. ర్యాంకింగ్స్ గురించి మరింత వివరంగా తెలుసుకుందాం..**

టెస్ట్ కొత్త ర్యాంకింగ్స్‌ను ఐసీసీ ప్రకటించింది. ఈ సారి టీమిండియా నుంచి నలుగురు



ఆటగాళ్లు టాప్-10లో చోటు దక్కించుకున్నారు. బ్యాట్స్‌మెన్ జాబితాలో ఇద్దరు కనిపిస్తే, బౌలర్ల జాబితాలో ఒకరు చోటు దక్కించుకున్నారు. ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ నంబర్ వన్ ప్లేస్‌లో ఉండటం విశేషం. మరి ఆ ప్లేయర్లు ఎవరో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం..

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న బౌలర్ టీమిండియా ప్రధాన పేసర్



జస్ప్రీత్ బుమ్రా. హెడింగ్లీలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో 5 వికెట్లు తీసిన బుమ్రా 907 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలుపుకున్నాడు. బుమ్రా తప్ప, టీం ఇండియా నుంచి మరే ఇతర బౌలర్ కూడా బౌలర్ల జాబితాలో టాప్ టెన్‌లో చోటు దక్కించుకోలేదు.

ఐసీసీ టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో టీమిండియా యువ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్



4వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో 101 పరుగులతో అద్భుతమైన సెంచరీ చేసిన జైస్వాల్ ఇప్పుడు 851 పాయింట్లతో 4వ స్థానంలో ఉన్నాడు.



ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేసిన రిషబ్ పంత్ 801 పాయింట్లతో టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో 7వ స్థానానికి ఎగబాకాడు. ఇది భారత వికెట్ కీపర్ సాధించిన అత్యుత్తమ స్థానం. అంటే.. టీమిండియా నుండి ఏ వికెట్ కీపర్ కూడా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 800 పాయింట్లకు పైగా సాధించలేదు. ఇప్పుడు పంత్ 801 రేటింగ్‌తో ఏడో స్థానంలో నిలిచాడు.

ఐసీసీ టెస్ట్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా కూడా అగ్రస్థానంలో ఉన్నాడు. 376 పాయింట్లతో జడేజా గత కొన్ని నెలలుగా అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగే మిగిలిన మ్యాచ్‌లలో అతను బాగా రాణిస్తే, అతని రేటింగ్ 400 దాటే అవకాశం ఉంది.

# టీమిండియా కొంపముంచుతున్న రిషభ్ పంత్ సెంచరీ..!



**రిషభ్ పంత్.. టీమిండియాలో చిచ్చర పిడుగు లాంటి బ్యాటర్. టెస్టు క్రికెట్‌ను టీ20లా ఆడగల దిట్ట. ధనాధన్ బ్యాటింగ్, ఫియర్‌లెస్ ఎటాకింగ్‌కు పెట్టింది పేరు. తాజాగా ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టెస్టులో కూడా ఏకంగా రెండు సెంచరీలు బాదేశాడు. రోహిత్ శర్మ టెస్ట్ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. శుబ్‌మన్ గిల్ టెస్ట్ జట్టుకు కెప్టెన్ అయితే, రిషభ్ పంత్ వైస్ కెప్టెన్ అయ్యాడు. తనకిచ్చిన వైస్ కెప్టెన్సీ పోస్ట్‌కు, తనకున్న అగ్రిసివ్ బ్యాటింగ్ బ్రాండ్‌కు న్యాయం చేస్తూ.. ఇంగ్లాండ్ గడ్డపై తొలి టెస్టులోనే రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలతో చెలరేగాడు. పంత్ బ్యాటింగ్‌తో అంతా హ్యాపీగా ఉన్నా.. ఓ బ్యాడ్ సెంటిమెంట్ ఇప్పుడు పంత్‌ను, పంత్ అభిమానులను వేధిస్తోంది.**

అదేంటంటే.. పంత్ సెంచరీ టీమిండియాకు అస్సలు కలిసి రావడం లేదు. ముఖ్యంగా విదేశాల్లో పంత్ సెంచరీ చేసిన ప్రతి సారి టీమిండియా విజయం దక్కడం లేదు. దీంతో.. పంత్ సెంచరీ టీమిండియాకు ఒక బ్యాడ్ సెంటిమెంట్‌లా మారిపోతుంది. 2018లో ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదో టెస్టులో రిషభ్ పంత్ విదేశాల్లో తన తొలి సెంచరీ నమోదు చేశారు. ఆ మ్యాచ్‌లో 114 పరుగులు సాధించాడు. అయితే ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ కెప్టెన్సీలోని టీమిండియా ఓటమి పాలైంది. అలాగే 2019లో ఆస్ట్రేలియాపై 159 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇక 2022లో సౌతాఫ్రికాలో 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో టీమిండియా ఓటమి పాలైంది. అదే ఏడాది ఇంగ్లాండ్‌లో 146 పరుగులు కొట్టాడు.. ఆ మ్యాచ్‌లోనూ టీమిండియా ఓటమి పాలైంది.

ఇక ఇప్పుడు తాజాగా ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌ల్లో 134, 118 పరుగులు సాధించినా కూడా టీమిండియాకు ఓటమి తప్పలేదు. విదేశాల్లో పంత్ సెంచరీ కొట్టిన ప్రతిసారి టీమిండియా ఓడిపోవడం, లేదా డ్రా అవ్వడమో జరిగింది తప్పా.. ఒక్క మ్యాచ్‌లో కూడా భారత్ విజయం సాధించలేదు. విదేశాల్లో పంత్‌కు ఆరు సెంచరీలు ఉన్నాయి. ఇలా రిషభ్ పంత్ సెంచరీలు టీమిండియాకు అస్సలు కలిసి రావడం లేదు. దీంతో పంత్ సెంచరీ చేయకపోయినా బాధలేదు కానీ, టీమిండియా గెలవాలని కొంతమంది క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు. క్రికెట్‌లో చాలా రకాల సెంటిమెంట్లు ఉంటాయనే విషయం తెలిసిందే. ఇప్పుడు వాటి సరసన ఈ పంత్ సెంచరీ సెంటిమెంట్ కూడా చేరింది. అయితే ఇది తప్పు అని నిరూపించే అవకాశం ఇప్పుడు పంత్ చేతుల్లోనే ఉంది. మిగిలిన నాలుగు టెస్టుల్లో తాను సెంచరీ చేయడంతో పాటు జట్టును గెలిపించగలిగితే.. ఈ బ్యాడ్ సెంటిమెంట్‌కు ఎండ్ కార్డ్ వేయొచ్చు. మరి పంత్ అది చేస్తాడో లేదో

# ఇంగ్లాండ్‌లో స్పెషల్ వాటర్ తాగుతున్న బుమ్రా..!

## ఆ నీటి ప్రత్యేకత ఏంటి? అవే ఎందుకు తాగాలి?

**ఇంగ్లాండ్ పర్యటనలో జస్ప్రీత్ బుమ్రా ప్రత్యేకమైన ఆల్కలైన్ వాటర్ తాగుతున్నాడు. ఈ నీరు %జూ౦% విలువ 7 కంటే ఎక్కువగా ఉండి, ఆమ్లత్వాన్ని తగ్గిస్తుంది, అలసటను నివారిస్తుంది. శరీరాన్ని వేగంగా కోలుకోవడానికి సహాయపడుతుంది. బుమ్రా భారత జట్టుకు కీలకమైన ఆటగాడు కాబట్టి, అతని ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను కాపాడటానికి ఈ నీటిని అందిస్తున్నారు.**

ఇప్పటివరకు టీమిండియాలో విరాట్ కోహ్లీ ఒక్కడే కాస్ట్లీ వాటర్ తాగుతాడని మాత్రమే మనం విన్నాం. కానీ, ఇప్పుడు దానికి జస్ప్రీత్ బుమ్రా కూడా ప్రత్యేకమైన నీరు తాగుతున్నాడు. ఇంగ్లాండ్ పర్యటనలో బుమ్రా ఈ ప్రత్యేకమైన నీళ్లు తాగుతూ కనిపించాడు. లీడ్స్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన తొలి టెస్ట్ సందర్భంగా బుమ్రా ఆ నీళ్లు తాగుతూ కనిపించాడు. బుమ్రా తాగుతున్న నీళ్లకు ప్రత్యేకత ఉంది. ఆ నీళ్లు తాగడం వల్ల 3 ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం..






### బుమ్రా తాగే నీటి ప్రత్యేకత..!

లీడ్స్ టెస్ట్ సమయంలో బుమ్రా తాగుతున్న నీటిని ఒక ఇంగ్లీష్ కంపెనీ తయారు చేసింది. సాధారణంగా ఆటగాళ్ళు ఎక్కువ వ్యాయామం చేసినప్పుడు, ఎక్కువ శ్రమించినప్పుడు లేదా అలసిపోయినప్పుడు లేదా వారి శరీరం వాపుకు గురైనప్పుడు ఈ నీటిని తాగుతారు. అటువంటి పరిస్థితులలో ఆటగాళ్ళు %జూ౦% విలువ 7 కంటే ఎక్కువ ఉన్న నీటిని తాగేందుకు ఇష్టపడతారు. లీడ్స్ టెస్ట్ సమయంలో బుమ్రా తాగిన నీటి ప్రత్యేకత ఏమిటంటే దాని %జూ౦% విలువ తటస్థంగా ఉంటుంది.

### 3 ప్రయోజనాలు..!

ఈ నీటిని తాగడం వల్ల 3 ప్రయోజనాలు ఉన్నాయి. మొదటిది.. ఈ రకమైన ఆల్కలీన్ నీటిని తాగడం వల్ల ఆమ్లత్వం తగ్గుతుంది. రెండవది.. అలసట ఉండదు. మూడవది.. శరీరం వేగంగా కోలుకుంటుంది. ఈ 3 కారణాల వల్లనే ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో బుమ్రా ఈ స్పెషల్ ఆల్కలీన్ వాటర్ తాగుతున్నాడు.

### బుమ్రాకే ఎందుకు?

బుమ్రాకు ఆ నీరు అవసరం. అతని పనిభారం అతని శరీరంపై పెద్దగా ప్రభావం చూపకుండా ఉండేందుకు ఇది ఎంతో సహాయపడుతుంది. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో బుమ్రా టీమిండియాకు ఎంతో కీలక ఆటగాడు. అటువంటి పరిస్థితిలో, గాయం, అలసట నుండి అతన్ని సురక్షితంగా ఉంచడం చాలా ముఖ్యం. బుమ్రాను ఫిట్‌గా ఉంచేందుకు భారత జట్టు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒకటి. అతనికి %జూ౦% విలువ 7 కంటే ఎక్కువ ఉన్న ఆ ప్రత్యేక నీటిని తాగడానికి ఇస్తున్నారు.

# తొలి టెస్ట్‌లో ఓటమి.. ఆ స్టార్ పేసర్‌ను ఇంగ్లాండ్ నుంచి ఇంటికి పంపిన టీమిండియా!



**ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు ఓడిపోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ పేసర్ హర్షిత్ రాణాను జట్టు నుంచి విడుదల చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీసినప్పటికీ, రెండవ ఇన్నింగ్స్‌లో రాణా ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేదు. ప్రస్తుతం టీమ్‌లోని పేసర్లు ఫిట్‌గా ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోచ్ గౌతమ్ గాంభీర్ తెలిపారు.**

ఐదు టెస్టు మ్యాచ్‌లు సుదీర్ఘ సిరీస్ ఆడేందుకు ఇంగ్లాండ్ వెళ్లిన యంగ్ టీమిండియాకు తొలి మ్యాచ్‌లోనే ఊహించని షాక్ తగిలింది. బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ.. తొలి టెస్టులో గిల్ సేన ఓటమి పాలైంది. ఈ ఓటమి తర్వాత ఓ స్టార్ పేసర్‌ను ఇంగ్లాండ్ నుంచి ఇండియాకు పంపించేశారు టీమ్ మేనేజ్‌మెంట్. తొలి టెస్ట్‌లో ఓడిపోయిన మరుసటి రోజు పేసర్ హర్షిత్ రాణాను జట్టు నుంచి విడుదల చేసినట్లు సమాచారం. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్ ఆరంభానికి కేవలం రెండు రోజుల ముందు రాణాను జట్టులోకి తీసుకున్నారు. అతను ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన రెండు ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఇండియా ఎ జట్టులో భాగమయ్యాడు. ఆ తర్వాత అతన్ని బ్యాకప్ పేసర్‌గా టీమ్‌లోకి తీసుకున్నారు.

అయితే ప్రస్తుతం టీమ్‌లోని పేసర్లంతా ఫిట్‌గా ఉండటంతో రాణాను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పేర్కొన్నాడు."ప్రస్తుతానికి, ప్రతిదీ బాగానే ఉంది, కాబట్టి అందరూ బాగానే ఉంటే, అతను తిరిగి వెళ్లాల్సి ఉంటుంది" అని గంభీర్ అన్నారు. ఆస్ట్రేలియాలో అరంగేట్రం చేసిన రాణా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రారంభంలో ప్రసిద్ధ్ కృష్ణ కంటే మెరుగైన ప్రదర్శన చేశాడు. మొదటి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టి మంచి ప్రదర్శన ఇచ్చాడు, కానీ రెండవ ఇన్నింగ్స్‌లో, తరువాతి టెస్ట్‌లో అదే స్థాయి ప్రదర్శన చేయలేకపోయాడు.

ఇక తొలి టెస్ట్ విషయానికి వస్తే.. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి రాణించిన జస్‌ప్రీత్ బుమ్రా తప్ప, మిగిలిన భారత బౌలింగ్ దాడి ప్రభావం చూపలేదు. మంగళవారం ముగిసిన తొలి టెస్ట్‌లో ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత పేస్ త్రయం %-% ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్ %-% లైన్, లెంగ్త్ లలో స్థిరత్వం లేకపోవడం వల్ల ఇబ్బంది పడ్డారు. సులభంగా పరుగులు సమర్పించుకున్నారు. వీరి ప్రదర్శనపై గంభీర్ స్పందిస్తూ.. మన బౌలర్లకు మరింత సమయంలో ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# పెద్ది కోసం బుచ్చిబాబు ఆ ప్రయోగం...!

మెగా ఫ్యాన్స్‌తో పాటు తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా 'పెద్ది'. ఈ సినిమాకు ముందు రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన



విషయం తెల్సిందే. ఆ సినిమా తీవ్రంగా నిరాశ పరిచిన నేపథ్యంలో ఈ సినిమా కోసం ఇంకాస్త ఎక్కువగానే చరణ్ కష్టపడుతున్నాడు. చాలా కసి మీద ఉన్న రామ్ చరణ్ పెద్ది సినిమా కోసం డే అండ్ నైట్ కష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా రెగ్యులర్ షుటింగ్ జరుగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్ ఆరంభంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో ప్రత్యేకమైన పాటను దర్శకుడు బుచ్చిబాబు ప్లాన్ చేస్తున్నాడట. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌లో దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చిన బుచ్చిబాబు అందరి దృష్టిని ఆకర్షించాడు. మొదటి సినిమాతోనే వంద కోట్లకు మించిన వసూళ్లు రాబట్టడంతో బుచ్చిబాబు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాడు. ఆయన దర్శకత్వంలో నటించేందుకు స్టార్ హీరోలు ఆసక్తి చూపించారు. ఉప్పెన విడుదల అయిన వెంటనే ఎన్టీఆర్‌తో సినిమాను చేసే అవకాశంను బుచ్చిబాబు దక్కించుకున్నాడు. కొన్ని కారణాల వల్ల సినిమా ఆలస్యం అవుతూ వచ్చింది. దాంతో ఎన్టీఆర్‌తో సినిమాను పక్కన పెట్టి రామ్ చరణ్‌తో సినిమాను మొదలు పెట్టాడు. చరణ్ తో మూవీ కోసం దాదాపు ఏడాది వెయిట్ చేసిన బుచ్చిబాబు ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో సినిమాను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. తన గురువు సుకుమార్ నుంచి అన్ని గుణాలను, సుగుణాలను పుణికి పుచ్చుకున్న బుచ్చిబాబు ఫిల్మ్ మేకింగ్ విషయంలోనూ అదే మార్క్ చూపిస్తున్నాడు. హీరోలను ఎలా చూపిస్తే ఫ్యాన్స్ ఫిదా అవుతారు, బాక్సాఫీస్ షేక్ కావాలంటే ఎలాంటి కథలు, కథనాలు కావాలి అనే విషయాలు బుచ్చిబాబు బాగానే గుర్తించినట్లు ఉన్నాడు. అందుకే తన మొదటి సినిమాలో లేని ఐటెం సాంగ్‌ను రామ్ చరణ్‌తో రూపొందిస్తున్న 'పెద్ది' సినిమాలో పెట్టబోతున్నాడట. ఈ సినిమాకు ఏ ఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్న విషయం తెల్సిందే. రెహమాన్ ఇప్పటికే ఒక ప్రత్యేకమైన పాట కోసం ట్యూన్ రెడీ చేశాడని, రాబోయే రోజుల్లో అత్యధికంగా వినిపించే పాటగా పెద్ది ఐటెం సాంగ్ నిలవబోతుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. రామ్ చరణ్‌కు జోడీగా అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ దేవర తర్వాత మరో భారీ విజయాన్ని ఈ సినిమాతో దక్కించుకుంటుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న నేపథ్యంలో బాలీవుడ్‌కు చెందిన మరో స్టార్ హీరోయిన్‌తో ఈ సినిమాకి ఐటెం సాంగ్ చేయించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే బుచ్చిబాబు మనసులో ఒక హీరోయిన్ పేరు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ హీరోయిన్ ఎవరు, ఎప్పుడు ఆ ఐటెం సాంగ్ షుటింగ్ చేస్తారు అనేది తెలియాల్సి ఉంది. నవంబర్ లేదా డిసెంబర్ వరకు పెద్ది షుటింగ్‌కు గుమ్మడి కాయ కొట్టే విధంగా దర్శకుడు బుచ్చిబాబు ప్లాన్ చేస్తున్నాడు.



మీనాక్షి చౌదరి


# చిరంజీవి, నాగార్జున మల్టీస్టారర్!



మెగాస్టార్ చిరంజీవి- కింగ్ నాగార్జునలను ఒకే ఫ్రేమ్ లో చూడాలని మెగా-అక్కినేని అభిమానులు ఎంతగా ఆశపడుతున్నారో? మాటల్లో చెప్పలేనిది. ఇండస్ట్రీలో ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్ కావడంతో ఆ కలయికను వెండి తెరపై చూడాలని ఎంతో ఆశిస్తున్నారు. ఆ కాంబినేషన్ లో సినిమా ఎప్పుడు ఉంటుందా? అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి ఆ ఛాన్స్ ఎప్పుడొస్తుందో చూడాలి. కానీ ఈ కాంబినేషన్ ని తెరపై ఆవిష్కరించిన దర్శకుడు మాత్రం ఎంతో అదృష్టవంతుడై ఉండాలి. చిరు-నాగ్ లను ఒకే సారి డైరెక్ట్ చేయడం అంటే అతడు పెట్టి పుట్టి ఉండాలి. ఆ అదృష్టవంతుడు ఎవరవుతారో చూడాలి. అలాగని కేవలం సీనియర్లకే సాధ్యమతుందా? అంటే అలాగని చెప్పలేని పరిస్థితి. నాగా ర్జున కొత్త దర్శకుల్ని ప్రోత్సహించడంలో ముందుంటారు. ఈ మధ్య కాలంలో చిరంజీవి కూడా అలాంటి వాళ్లను బాగానే ఎంకరేజ్ చేస్తున్నారు. కథనచ్చి అతడిపై నమ్మకముంటే వెళ్లిపోతున్నారు. సీనియర్ల కంటే వీళ్లే బెటర్ అన్న ధోరణి చిరు లో కనిపిస్తుంది. కాబట్టి డైరెక్ట్ చేసే అవకాశం కేవలం సీనియ ర్లకే కాదు...కొత్త వాళ్లకు కూడా ఉంటుంది. కనీసం ఒక సినిమా అయినా చేసి ఉంటే అవకాశం ఈజీ అవుతుంది. చిరు-నాగ్ ల ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని సరైన స్క్రిప్ట్ తో అప్రోచ్ అయితే కొత్త రైటర్లకు అవ కాశం లేకపోలేదు. నేరుగా ఛాన్స్ రాకపోయినా? అతడి ఎంట్రీకి ఈ అవకాశం అన్నది దోహదం చేస్తుంది. ఇండస్ట్రీ విధానం మారిన నేపథ్యంలో రైటర్ నుంచి డైరెక్టర్ అవ్వడం పెద్ద విషయం కాదు. చిరు-నాగ్ లను కలపాలని గతంలోనే ఈవీవీ సత్యానారాయణ ఓ ప్రయత్నం చేసారు. కానీ సెట్ అవ్వ లేదు. అప్పటి నుం చి మరో డైరెక్టర్ అలాంటి ప్రయత్నాలు చేయలేదు. మరి ఇప్పుడా ఛాన్స్ ఎవరు తీసుకుంటారో చూడాలి.

# జూలై లో బాక్సాఫీస్ వద్ద దుమ్ము దుమారమే!

జూన్ లో రిలీజ్ అయిన 'కుబేర' భారీ విజయం సాధించింది. ఇప్పటికే ఈ సినిమా 100 కోట్ల క్లబ్ లో చేరింది. ఖర్చు పరంగా చూస్తే ? సినిమాకు పారితోషికాలు తప్ప ఇంకేం కనిపించలేదు. కాబట్టి భారీ ఎత్తున లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ మధ్య కాలంలో సరైన సక్సెస్ లేక వెలవెలబోతున్న బాక్సాఫీస్ ను కుబేర కాస్త షేక్ చేసింది. మరి ఈ షేకింగ్ జూలైలో కూడా కొనసాగుతుందా? అంటే ఎలాంటి డౌట్ అవసరం లేదు. జులై 4న యూత్ స్టార్ నితిన్ నటించిన 'తమ్ముడు'రిలీజ్ అవుతుంది. ఈ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. ఈ సినిమాతో సక్సెస్ కూడా నితిన్ కి అంతే అవసరం. సినిమాపై అతడు కూడా చాలా కాన్ఫి డెంట్ గా ఉన్నాడు. సక్సెస్ అందుకుని హిట్ రేసు లోకి రావాలని ఎదరు చూస్తున్నాడు. 'తమ్ముడు' టైటిల్ కూడా కలిసొస్తుంది. పవన్ అభిమాని...పైగా పవన్ సినిమా టైటిల్ కాబట్టి పీకే అభిమానులు ప్రోత్సహించే ఛాన్స్ లేకపోలేదు. అటుపై జూలై 11న అనుష్క నటించిన 'ఘాటీ' రిలీజ్ అవుతుంది. అనుష్కను తెరపై చూసి నెలలు గడుస్తోంది. పవర్ ఫుల్ పాత్రలో చూసైతే కొన్ని సంవత్సరాలవుతుంది. అలాంటి అనుష్కను 'ఘాటీ'లో చూపిస్తుందని అంచనాలు భారీగా ఉన్నాయి. వాస్తవ సంఘటనలు ఆధారంగా తెరకెక్కుతోన్న సినిమా కావడంతో హిట్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే ఐదేళ్ల హరిహరవీరమల్లు నిరీక్షణకు అదే నెల 24న తెర దించుతున్నారు. పవన్ కళ్యాణ్ నటించిన ఈసినిమా 24 న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. మొఘలులుపై వీరమల్లు తిరుగుబాటు ఎలా ఉంటుంది? అన్నది ఆద్యంతం ఆసక్తికరంగా మలిచారు. పాన్ ఇండియాలో రిలీజ్ అవుతున్న చిత్రం వందల కోట్లు వసూళ్లు సాధిస్తుందని అంచనాలున్నాయి. విజయ్ దేవరకొండ నటిస్తోన్న 'కింగ్ డమ్' కూడా అదే నెలలో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. అప్పటికి పోస్ట్ ప్రొడక్షన్ సహా అన్ని పనులు పూర్తవుతాయని టీమ్ భావిస్తోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో అంచనాలు పీక్స్ లో ఉన్న సంగతి తెలిసిందే.




# కాలేజీ రోజుల్ని గుర్తు చేసే సినిమా

రాజ్ గురు బ్యానర్ పై దయానంద్ గడ్డం రచనా దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మిస్తున్న చిత్రం 'వర్జిన్ బార్సు'. జూలై 11వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలోని 'దం దిగా దం..' పాటను బుధవారం మేకర్స్ రిలీజ్ చేశారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ చిత్రంలోని పాటలు మార్కెట్లోకి విడుదలయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాత రాజా దారపనేని మాట్లాడుతూ, 'ఈ చిత్రం నుండి విడుదలైన టీజర్‌తో, తాజాగా రిలీజైన పాటకు మంచి స్పందన లభించింది. సినిమా యూత్‌ఫుల్‌గా ఉంటుంది. ఇప్పటికే ఈ చిత్రాన్ని చూసిన సెన్సార్ సభ్యులు బాగుందని ప్రశంసించారు. సినిమాలో వినోదంతో పాటు మంచి లవ్ స్టోరీ కూడా ఉంది. 'ఏ' సర్టిఫికెట్ పొందిన మా చిత్రాన్ని నైజాంలో ఏషియన్ సునీల్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు' అని తెలిపారు. 'సినిమా చూస్తున్నంత సేపూ మీ కాలేజీ రోజులు గుర్తొస్తాయి. మా నిర్మాత రాజా ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. సంగీత దర్శకుడు స్మరణ్ సాయి బిజీఎంతో పాటు ఆరు పాటలను అద్భుతంగా కంపోజ్ చేశారు. ఓ మంచి సినిమాతో మీ ముందుకు రాబోతున్నాం' అని దర్శకుడు దయానంద్ గడ్డం చెప్పారు.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339